క్లుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: మండలంలోని పత్తిపాక గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని బుధవారం ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్యాణోత్సవం కార్యక్రమంలో ఆయన పూజల్లో పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని బొట్లవనపర్తి గ్రామంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మతల్లి బోనాల మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, డైరెక్టర్‌లు వెంకటేశ్వర్‌రావు, రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎదుల్ల అంజయ్య, బద్దం నర్సింహారెడ్డి, మల్లేశం, తిరుపతిరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి భూమి వితరణ

పత్తిపాక శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఈగం నందయ్య, గౌరిలక్ష్మి జ్ఞాపకార్థం రెండు గుంటల భూమితో పాటు ఇంటిని వారి కుమారులు ఈగం వీరేశం, మురళి, కిషన్ విరాళంగా ఇచ్చారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న విండో చైర్మన్

ధర్మారం: మండలంలోని నందిమేడారం సహకార సంఘం భవనంలో బుధవారం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను మేడారం సింగిల్‌విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి పంపిణీ చేశారు. రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే వరిపొలాల్లో భూసారం కోసం జీలుగ, జనుము విత్తనాలను రైతులకు అందించారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ పోను 30కిలోల జీలుగ బస్తాకు రూ.1116, జనుము 40 కిలోల బస్తాకు రూ.1448 రైతులు చెల్లించాలని చైర్మన్ తెలిపారు. బస్తా 2.20 ఎకరాలకు వస్తుందన్నారు. భూసారాన్ని పెంచే ఈ విత్తనాలను రైతులు సాగు చేయాలని ఆయన కోరారు.

అంబలి పంపిణీ కేంద్రానికి ఆర్థికసాయం

కమాన్‌పూర్: మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అంబలి పంపిణీ కేంద్రానికి కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి బుధవారం రూ.10వేలు ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో జంగపెల్లి సతీశ్, మోర ప్రశాంత్, చందు, నల్లవెల్లి శంకర్, మచ్చగిరి రాము ఉన్నారు.

24న శివపార్వతుల కల్యాణం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల సాంబమూర్తి ఆంజనేయ ఆలయంలో ఈనెల 24న శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే కల్యాణ మహోత్సవంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం ఆలయ 22వ వార్షిక వేడుకలు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన గురుస్వామి భద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని ఉదయం అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకం, తీర్థప్రసాద వితరణ మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం మహా పడిపూజ ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వార్షిక వేడుకలు విజయవంతం చేయాలని కోరారు.

తహసీల్ కార్యాలయం బోర్డుపై జిల్లా పేరేది?



జిల్లా పేరు లేని కార్యాలయం బోర్డు

జ్యోతినగర్: రాష్ట్రంలో జిల్లాలు ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న రామగుండం తహసీల్దార్ కార్యాలయం బోర్డుపై పాత కరీంనగర్ జిల్లా పేరును తుడిచివేశారు. కానీ దాని స్థానంలో పెద్దపల్లి జిల్లా అని మాత్రం రాయించడం మరచిపోయారు. బోర్డు మీద దృష్టి సారించని విధంగానే పనులు కూడా జాప్యం చేస్తున్నారని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

పగిలిన వాటర్ పైప్‌లైన్

- బల్దియాలో నిలిచిన తాగునీటి సరఫరా
- పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



పగిలిన తాగునీటి పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో వాటర్ ట్యాంక్‌లకు వాటర్ సరఫరా చేసే తాగునీటి పైపులైన్ మంగళవారం అర్ధరాత్రి పగిలిపోయింది. దీంతో బుధవారం నగరంలో తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గోదావరిఖని మార్కండేయకాలనీ శివాలయానికి వెళ్లే ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి ఓ ప్రైవేట్ సంస్థ సిబ్బంది గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో, బల్దియాకు చెందిన ముఖ్యమైన నీటి సరఫరా పైప్‌లైన్ పగిలింది. దీంతో పలు ట్యాంకులకు నీటి సరఫరా నిలిచిపోవడంతో, ఆయా ట్యాంకుల పరిధిలోని కుటుంబాలకు అధికారులు నీటి సరఫరా చేయలేకపోయారు. పగిలిన పైప్‌కు అవసరమైన పరికరాలను హైదరాబాద్ నుంచి తీసుకురావాల్సి ఉంది. దీంతో మరమ్మతు చేయడానికి ఆలస్యం జరుగుతుందని అధికారులు తెలిపారు. పగిలిపోయిన తాగునీటి పైప్‌లైన్‌ను మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నిలిచిపోయిన నీటి సరఫరా..

అశోక్‌నగర్ ట్యాంక్ పరిధిలోని గాంధీనగర్, అశోక్‌నగర్, మార్కండేయ కాలనీ కొంత భాగం, హనుమాన్‌నగర్, లెనిన్‌నగర్, అంబేద్కర్‌నగర్, మల్లికార్జున్‌నగర్, సీతానగర్, రామ్‌నగర్, సంజయ్‌నగర్, జ్యోతినగర్, ఫైవింక్లయిన్ ఏరియా, కొంత భాగం, అలాగే సీఎస్పీ వాటర్ ట్యాంక్ పరిధిలోని విద్యానగర్, సూర్యానగర్, బాపూజీనగర్, జీఎం కాలనీ, గంగానగర్, జనగాం పరిధిలోని ప్రజలకు గురువారం వరకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ఎప్పటిలాగే నీటి సరఫరా చేస్తామని, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకొని సహకరించాలని కమిషనర్ కోరారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ పట్నాలు



పట్నాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవం రేణుక ఎల్లమ్మ పట్నాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని రూపునారాయణపేట గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే విజయరమణరావు పూజలు చేశారు. గౌడసంఘం నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు.

నేత్రదాత కుటుంబ సభ్యులకు అభినందన పత్రం



అభినందన పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని స్వతంత్ర చౌక్‌కు చెందిన జంగంపల్లి సవిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసి ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం నేత్రదాత సంస్మరణ సభను సదాశయ ఫౌండేషన్, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నేత్రదాత భర్త పోశం, కూతుళ్లు, కుమారులను సదాశయ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి సత్కరించి అభినందన పత్రాన్ని అందజేశారు. అనంతరం నేత్ర, అవయవ, శరీరదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, జిల్లా అధ్యక్షుడు ఆరెపెల్లి రాజమౌళి, మహిళా ప్రతినిధురాలు జ్యోతి, తానిపర్తి గోపాల్‌రావు, మాదాసు రామ్మూర్తి, పూర్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళ కడుపులోంచి 15కిలోల కణితి తొలగింపు

- అరుదైన శస్త్రచికిత్స చేసిన మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్



కణితి చూపిస్తున్న మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్

కోల్‌సిటీ: కడుపులో నొప్పి, శ్వాస ఇబ్బందితో బాధపడుతూ చికిత్స కోసం వచ్చిన ఓ మహిళకు రామగుండం మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్ అరుదైన శస్త్రచికిత్స చేసి ఆమె కడుపులో నుంచి 15 కిలోల కణితి తొలగించారు. గోదావరిఖని ద్వారకానగర్‌కు చెందిన వేముల వనజ అనే మహిళ కొంతకాలంగా కడుపునొప్పి, శ్వాస తీసుకోవడంతో బాధపడుతోంది. మేయర్ నిర్వహిస్తున్న ఆస్పత్రిలో పేషెంట్‌ను కుటుంబ సభ్యులు అడ్మిట్ చేశారు. బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ అనిల్‌కుమార్, ఆమె కడుపులో కణితి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే శస్త్రచికిత్స చేసి కణితిని బయటకు తీశారు. అరుదైన శస్త్ర చికిత్స చేసిన మేయర్‌ను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రత్యేకంగా అభినందించారు.

పర్స సత్యనారాయణ వర్ధంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు



నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

గోదావరిఖని: సీఐటీయూ నాయకుడు పర్స సత్యనారాయణ వర్ధంతిని బుధవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. యూనియన్ జెండా ఎగురవేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. సీఐటీయూ నాయకులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2ఏరియా యైటింక్లయిన్ కాలనీ సీఐటీయూ కార్యాలయంలో బుధవారం కామ్రేడ్ పర్స సత్యనారాయణ వర్ధంతి నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు ఉల్లి మొగిలి నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్మికులకు సత్యనారాయణ చేసిన సేవలను కొనియడారు. జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు సత్యనారాయణ శత జయంతి వేడుకలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, వెంకన్న, సంపత్ కుమార్, అవినాష్, భూమయ్య, లక్ష్మీనారాయణ, రామన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థికి గోల్డ్‌మెడల్



కోచ్‌తో విద్యార్థి అమృత్‌సాయి

గోదావరిఖనిటౌన్: ఇటీవల మలేసియాలో నిర్వహించిన 20వ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక సెక్రెడ్ హార్ట్ పాఠశాలకు చెందిన విద్యార్థి మేడి అమృత్‌సాయి అండర్–16 విభాగంలో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాడు. విద్యార్థి మెడల్ సాధించడంపై పట్ల పాఠశాల కరస్పాండెంట్ లవ్‌లీ జాకబ్, ప్రిన్సిపాల్ జ్యోత్స్న, ప్రైమరీ ఇన్‌చార్జి ఇన్నమ్మ, ఎన్‌సీసీ ఆఫీసర్ జ్యోత్స్న, కరాటే కోచ్ మొండయ్య అభినందించారు.

అణగారిన వర్గాలకు దిక్సూచి భాగ్యరెడ్డివర్మ



నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: 'అణగారిన వర్గాలకోసం అహర్నిశలు శ్రమించిన మాదరి భాగ్యరెడ్డివర్మ మనకు దిక్సూచి' అని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య అన్నారు. భాగ్యరెడ్డివర్మ 136వ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక తెలంగాణ అంబేద్కర్ ట్రస్ట్ భవన్‌లో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భాగ్యరెడ్డివర్మ అణగారిన వర్గాల కోసం విద్య, సాంస్కృతిక, రాజకీయ చైతన్యం కోసం కృషిచేసిన మహోన్నతుడు అని కొనియాడారు. భాగ్యరెడ్డివర్మ జయంతి ప్రభుత్వపరంగా నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కన్వీనర్ బూడిద మహేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షురాలు ఎం.వరలక్ష్మి, సంఘం జిల్లా కోకన్వీనర్ దుబాసి బొందయ్య, నాయకులు కొండ్ర వెంకటేష్, పెరుక రవి, కాసిపేట పోచం, గద్దల నవీన్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలి

కమాన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో ప్రయివేటు విద్యా సంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. బకాయి ఉన్న రూ.7వేల కోట్లు వెంటనే చెల్లించి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.

విద్యార్థులకు అభినందనలు



అభినందిస్తున్న మాజీ జెడ్పీటీసీ రమేశ్

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన హర్షవర్ధన్, అభినవ్ కారటే కటా, స్పారింగ్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు కరాటే మాస్టర్ జి.సతీశ్ తెలిపారు. బుధవారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంకీ ఫాస్ట్ కుంగ్‌ఫూ అకాడమీ నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు, మాజీ జెడ్పీటీసీ ఐల రమేశ్ సన్మానించారు. ఈనెల 19న అంతర్జాతీయ పోటీలు గోవాలో నిర్వహించారని, అందులో పాల్గొని మెడల్ సాధించారని తెలిపారు. మాస్టర్ సతీశ్, స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి, వాకర్స్ రమేశ్, మంద శ్రీనివాస్, బైరగోని ప్రభాకర్, ఎల్లయ్య, రామకృష్ణ, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

ఖేలో ఇండియా సెంటర్ సందర్శన

సుల్తానాబాద్: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఖోఖో సెంటర్‌లో అత్యధిక మంది పాల్గొనడం శుభపరిణామమని జిల్లా డీఎస్‌వైవో సురేశ్ అన్నారు. పట్టణంలోని స్టేడియంలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా సెంటర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. క్రమశిక్షణగా క్రీడా నైపుణ్యాన్ని పెంచుకుని జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శంకరయ్య, సెంటర్ కోచ్ గెల్లు మధుకర్‌యాదవ్, పీఈటీలు ప్రణయ్, ఇక్బాల్ పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు రైతులకు లాభదాయకం



నవధాన్యాలను చల్లుతున్న రైతులు

ముత్తారం: వ్యవసాయ భూమిలో నవధాన్యాలు విత్తడంతో జీవవైద్యం పెరిగి భూమికి ఎంతో మేలు జరుగుతుందని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ కేశవపూర్ రైతు ఉత్పత్తిదారుల క్షేత్ర పరిశీలకులు చెలుకల యుగేందర్, రాజశేఖర్ అన్నారు. ముత్తారం మండలం ధర్యపూర్‌లో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని వ్యవసాయ భూమిలో ఓ రైతుతో నవధాన్యాలు చల్లించారు. 20రోజుల తర్వాత నేల దుక్కి దున్నడంతో నత్రజని స్థిరీకరించి భూసారం పెరుగుతుందని రైతులకు వివరించారు. కార్యక్రమంలో కాల్వ శ్రీరాంపూర్ పీయూ మేనేజర్ సాయిప్రకాశ్‌రెడ్డి, రైతులు రాపెల్లి రాజయ్య, మందల కిషన్‌రెడ్డి ఉన్నారు.

అధికారుల పర్యవేక్షణ లేకుండా మట్టి తరలిస్తున్నారు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి పెద్ద చెరువులో అధికారుల పర్యవేక్షణ లేకుండా ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జూలపల్లి పెద్ద చెరువులో అధికారులు ఇచ్చిన గడువు దాటినప్పటికీ ఎలాంటి వే బిల్లులు, చలాన్లు లేకుండా మట్టి రవాణా జరుగుతున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. లారీలతో ఏదైనా ప్రమాదం జరిగితే పూర్తి బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు తాటికొండ శంకర్, గుర్రం లక్ష్మిమల్లు, బొమ్మగాని అనిల్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


దైనందిన జీవితంలో ధ్యానం చేయాలి



జ్ఞాన బోధన చేస్తున్న తిరుపతి

జ్యోతినగర్: శ్వాస మీద ధ్యాసతో ధ్యానం చేయాలని జ్ఞాన బోధకులు తిరుపతి అన్నారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లో మూడు రోజుల పాటు ఉచిత ధాన్య–ఆత్మజ్ఞాన శిక్షణ శిబిరంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ధ్యానం తప్పకుండా చేయాలని సూచించారు. మనస్సును అదుపులో ఉంచుకోవడానికి ధ్యానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలకు జ్ఞానబోధ అందించాలనే ఉద్దేశంతో రమాదేవి మూడురోజుల శిక్షణ కేంద్రంలో అన్ని వసతులు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో జగదీష్, శ్రీదేవి, మల్లీశ్వరి, నీలిమ, వసంత తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షాపరులకు బిక్ష



అన్నం వడ్డిస్తున్న యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజ్‌కుమార్

సుల్తానాబాద్: పట్టణంలో ఉన్న పెరిక గద్దె హనుమాన్ ఆలయంలో హనుమాన్ దీక్షాపరులకు పెద్దపల్లి పట్టణానికి చెందిన రమ్య–శ్రీనివాస్ దంపతులు బుధవారం బిక్ష ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల రామేశ్వర్‌రావు, యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజ్‌కుమార్, జి.సంతోష్, నూక రాందాస్, చింతల శ్రీనివాస్, న్యాతరి మహేందర్, గెల్లు మధుకర్, న్యాతరి అంజయ్య, బొంకూరి ప్రసాద్, సత్యం పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షాపరులకు ముస్లిం యువకుడి బిక్ష

సుల్తానాబాద్: సుల్తానాబాద్ నుంచి పాదయాత్రగా వెళ్లిన హనుమాన్ దీక్షాపరులకు పట్టణానికి చెందిన ఎండీ రఫీక్ స్వయంగా వెళ్లి గంగాధర మధ్య ప్రాంతంలోఉన్నవారికి అన్నదానం చేశారు. అయ్యప్ప స్వామి దీక్షాపరులకు ప్రతి ఏటా బిక్ష ఏర్పాటు చేస్తానని, ఈ ఏడాది హనుమాన్ దీక్షాపరులకు అందించానని తెలిపారు. కూకట్ల నాగరాజు, కొయ్యడ రమాకాంత్, గాదం వినయ్, అఖిల్ ఉన్నారు.

మద్యంషాపులో చోరీ

ఓదెల: ఓదెలలోని మల్లికార్జునస్వామి మద్యంషాపులో గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం రాత్రి దొంగతనానికి పాల్పడ్డట్లు పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మద్యం షాపు వెనుకభాగం నుంచి తలుపులు పగులగొట్టి లోపలికి చొరబడ్డాడర. లోపలికి ప్రవేశించిన వ్యక్తి కౌంటర్‌లోని రూ.71,500 ఎత్తుకెళ్లారు. మద్యం షాపు గుమాస్తా కాసర్ల స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఘటన స్థలాన్ని సందర్శించిన ఏసీపీ

ఓదెల మద్యంషాపులో దొంగతనం జరిగిన సమాచారం తెలుసుకున్న పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ సంఘటన స్థలాన్ని సందర్శించారు. షాపులో జరిగిన దొంగతనం గురించి అన్ని కోణాల్లో ఆరా తీశారు. దొంగను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ నిర్మాణం ఇంకెన్నాళ్లు

గోదావరిఖని: కార్మిక కుటుంబాలకు పరిశుభ్రమైన నీటి సరఫరా కోసం ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ ఏర్పాటులో జాప్యం జరుగుతోందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి విమర్శించారు. బుధవారం జీడీకే–2ఏగని సమీపంలో రూ.20కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు పనులు చాలా నెమ్మదిగా సాగుతున్నాయన్నారు. యజమాన్యం మిషన్ భగీరథ పైపులైన్‌తో అనుసంధానం చేయాలని, అదనపు ఆర్‌వో ప్లాంట్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామమూర్తి, పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్, దూట శేషగిరి, జనగామ మల్లేశ్, వాసర్ల జోసెఫ్, రమేశ్, భాస్కర్, అంజయ్య పాల్గొన్నారు.

ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల కోసం ఏర్పాట్లు



సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిసరాల్లో మున్సిపల్ కార్మికులతో బుధవారం శుభ్రం చేయించినట్లు మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ తెలిపారు. ఈనెల 24 నుంచి జూలై మొదటి వారం వరకు ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల కోసం పరిసరాలు శుభ్రం చేయించినట్లు ఆయన పేర్కొన్నారు.

వీధి దీపాలు వెలగడంలేదు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని తొగర్రాయి గ్రామంలో పది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు గడ్డం అనిల్‌గౌడ్ బుధవారం పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు.

కనుల పండువగా శ్రీవేంకటేశ్వరుని కల్యాణం

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన పూజారులు, బండవరం ఎంబేరు, రంగనాథచార్యులు కల్యాణం నిర్వహించగా ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశ్ యాదవ్, మాజీ సర్పంచ్ సంతోశ్‌రావు పాల్గొని మొక్కులు చెల్లించారు. శ్రీవేంకటేశ్వరుని రథోత్సవం గురువారం ఉదయం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

హనుమాన్ ఆలయంలో భక్తుల పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఓదెల: మండలంలోని హరిపురం హనుమాన్ ఆలయంలో భక్తులు బుధవారం పూజలు చేశారు. అదే గ్రామానికి చెందిన 50మంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా కొండగట్టుకు వెళ్లనున్నట్లు భక్తులు తెలిపారు. అమ్ముల బిక్షపతి, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.